నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

బొంరాస్‌పేట, మే 28 : రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని పంటలు సాగు చేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు శంకర్ రాథోడ్ అన్నారు. విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని బాపన్‌చెరువుతండాలో ఆయన రైతులకు నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేముందు అవి నకిలీవా నాణ్యమైనవా అనేవి చూసుకోవాలని, లూజు విత్తనాలు కొని నష్టపోరాదని సూచించారు. వ్యవసాయ శాఖ నియమించిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొన్న తరువాత వాటికి రసీదు తీసుకోవాలన్నారు. పంట చేతికొచ్చే వరకు రసీదులను భద్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో హేమ, రైతులు పాల్గొన్నారు. మండలంలోని నాందార్‌పూర్, వడిచెర్ల గ్రామాల్లో ఏఈవో రేణుక రైతులకు విత్తన కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

కొడంగల్: నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఏడీఏ శంకర్‌రాథోడ్ తెలిపారు. మంగళవారం ఆయన కొడంగల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి లైసెన్స్‌లు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్ పై కంపెనీ పేరు, విత్తనం ఎప్పుడు తయారు చేయబడింది, ఎంత వరకు గడువు ఉందో చూసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కొనుగోలు చేసిన విత్తనం రసీదు, విత్తన ప్యాకెట్‌ను పంట కోత సమయం వరకు భద్రపరచుకోవాలని తెలిపారు. విత్తనా నికి సంబంధించిన ఆధారాలు ఉన్నప్పుడే విత్తనం ద్వారా ఎటువంటి నష్టం వాటిల్లినా చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా లూజు గా విత్తనాలు అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే వ్యవసాయాధికారులకు లేదా పోలీసులకు చేరవేయాలని కోరారు.

మర్పల్లి: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వసంత అన్నారు. మంగళవారం మండలంలోని కోట్‌మర్పల్లి, దార్గులపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారని, నాణ్యమైన విత్తనం సాగుచేస్తేనే అధిక దిగుబడి వస్తుందని చెప్పారు.. డీలర్లు ఎంఆర్‌పీ ధరకన్నా ఎక్కువ ధరకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఏఈవో నీరజ పాల్గొన్నారు

దోమ : వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని ఏడీఏ లక్ష్మీకుమారి అన్నారు. వాన కాలం సీజన్ పంట కాలం ప్రారంభమవుతున్న సందర్భంగా దోమ మండల పరిధిలోని బాసుపల్లి గ్రామాన్ని ఏడీఏ లక్ష్మీకుమారి సందర్శించి విత్తనాలు కొనుగోలు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కావ్య, రైతులు, మహిళా రైతులు, యువకులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట:బాపన్‌చెరువుతండాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శంకర్ రాథోడ్

మర్పల్లి:కోట్‌మర్పల్లిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

దోమ: బాసుపల్లిలో అవగాహన కల్పిస్తున్న ఏడిఏ లక్ష్మీకుమారి

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

పూడూరు, మే 28: ప్రతి రైతు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పీఏసీఎస్ ద్వారా నిర్వహిస్తున్న జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ నెల చివరి తేది వరకు కొనుగోలు చేయనున్నట్లు సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి ఎమ్మెల్యేతో పేర్కొన్నారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ స్థానిక రైతుల కోరిక మేరకు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ మరో వారం రోజుల పాటు కొనుగోలుకు గడువు పొడి గించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడి నష్టపోకుండా ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. నాణ్యమైన గింజలకు ప్రభుత్వం రూ.3180లు మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు పంటమార్పిడి పాటించి శాస్త్రీయ పద్ధతుల ద్వారా సాగుచేసి మంచి దిగుబడి సాదించాలని సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్లు చెన్నయ్యగౌడ్, శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ సొసైటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనంద్, కె.రమేశ్, కె.అమార్‌నాథ్, సిబ్బంది కె.మురళీయాదవ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల యూనిఫాం సకాలంలో ఇవ్వాలి

తుంకిమెట్లలో యూనిఫాంను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

బొంరాస్‌పేట, మే 28 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంను సకాలంలో అందించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ మహిళా సంఘం సభ్యులకు సూచించారు. మంగళవారం మండలంలోని బొంరాస్‌పేట, కొత్తూరు గ్రామాల్లో విద్యార్థుల యూనిఫాం కుడుతున్న మహిళా సంఘం సభ్యుల కుట్టు మిషన్ కేంద్రాలను ఆయన సందర్శించి వారు కుట్టిన యూనిఫాంను పరిశీలించారు. విద్యార్థుల యూనిఫాంను కుట్టే పనిని మహిళా సంఘాలకు అప్పగించడం వల్ల మహిళలకు ఉపాధి లభిస్తుందని దీనిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు సరిపోయేలా నాణ్యంగా యూనిఫాం కుట్టాలని సూచించారు. ఈ నెలాఖరులోగా కుట్టుపని పూర్తయ్యే విధంగా చూడాలని శ్రీనివాస్ ఆదేశించారు. యూనిఫాంను పరిశీలించి బాగా కుట్టారని మహిళలను అభినందించారు. అనంతరం కొత్తూరులో నర్సరీని పరిశీలించి అందులోని మొక్కలను పరిశీలించారు. వర్షాలు ప్రారంభమై హరితహారం నాటికి మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉండాలని, మొక్కలు వాడిపోకుండా రోజూ వాటరింగ్ చేయాలన్నారు. ఆయన వెంట డీపీఎంలు రామ్మూర్తి, శ్రీనివాస్, ఏపీఎం సత్యం, సీసీ యాదయ్య, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కుక్క కాటు.. పలువురికి గాయాలు

పరిగి, మే 28: బాలుడితోపాటు ఎనిమిది మందిని కుక్క కాటు వేసిన ఘటన పరిగిలో చోటు చేసుకుంది. సోమ వారం రాత్రి సుమారు 8.30 గంటల ప్రాంతంలో అనస్ (4) పరిగి పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో గల తమ దుకాణం ముందు సైకిల్ తొక్కుతుండగా కుక్క ఒక్కసారిగా దాడి చేసి బాలుడి ముఖంపై విచక్షణా రహితంగా కరిచింది. దీంతో అనస్ కన్ను, చెంపకు గాయాలయ్యాయి. వెంటనే బాలు డిని కుక్క నుంచి రక్షిం చేందుకు ప్రయ త్నించిన అతడి తండ్రి షేక్ అమ్జద్‌ను సైతం కుక్క కరిచింది. బాలుడికి పరిగి సర్కారు దవాఖా నలో ప్రాథమిక చికిత్స చేయించి వికారాబాద్‌లోని ఆసు పత్రికి తరలించా రు. ఈ మేరకు తండ్రి, కొడుకులకు చికిత్స జరిపారు. వారితో పాటు అదే కాలనీకి చెందిన శ్రీజ(12), ప్రవళిక(12), నవకి శోర్(17), జ్ఞానే శ్వర్ (6), భాగ్య(40), సింధు (30)లను సైతం అదే కుక్క కరిచింది. దీంతో వారు చికిత్స పొందారు.

వైభవంగా కల్యాణం

పూడూరు, మే 28 : దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి గ్రామంలోని శివాలయ 22వ వార్షికోత్సవం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకొని మల్లికార్జున స్వామికి నైవేద్యం సమర్పించారు. మంగళవారం ఉదయం పార్వతీపరమేశ్వరుల కల్యాణం పల్లె లక్ష్మీచెన్నయ్యగౌడ్ దంపతులు నిర్వహించగా, అన్నదానం బంటు శారదావేణు దంపతులు నిర్వహించారు. సాయంత్రం పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సతీశ్‌రెడ్డి, ఆనం దం, రఘునాథ్‌రెడ్డి, సురేందర్, అబ్రహం, శ్రీశైలంగౌడ్, భజన భక్తులు, యువజన సంఘం నాయకులు, ఆయా పార్టీల నేతలు పూజలు చేశారు. అర్చకులు ప్రవీణ్ భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్, మే 28: ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. అధికారుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీని ఆనుకుని సుమారు 600 గజాల ఖాళీ స్థలం ఉంది. దీన్ని ప్రభుత్వ స్థలంగా ల్యాండ్ బ్యాంక్‌లో ఉంచారు. కాగా, ఈ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఇటీవల కొంతమంది వ్యక్తులు స్థలం చుట్టూ బ్లూషీట్లు ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది మంగళవారం అక్కడికి చేరుకుని జేసీబీ సాయంతో బ్లూ షీట్లను కూల్చేశారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ కలవల సౌమ్య, తండ్రి: కలవల విశ్వేశ్వరరావు, నివాసం: ఇం.నెం. 2-3-103/1, ఆదర్శ్ నగర్ కాలనీ, రోడ్ నెం. 1/C, నాగోల్, హైదరాబాద్-500 068 గారు, రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ మండలం, పసుమాముల గ్రామం వద్దగల "శ్రీరాం నగర్"లోని సర్వే నెం.లు 445, 446, 447, 448/1 & 448/2లో 1250 చ.అడుగుల బిల్టప్ ఏరియాతో 125.415 చ.మీటర్లకు సమానమైన 150 చ.గజాల విస్తీర్ణపు ప్లాట్ నెం. 231 దక్షిణ భాగంలో నిర్మించిన గ్రౌండ్ ఫ్లోర్ కలిగిన ఇల్లు మరియు సరిహద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం. 231 ఉత్తర భాగం, దక్షిణం: ప్లాట్ నెం. 232, తూర్పు: ప్లాట్ నెం. 237, పడమర: 30 అ.వెడల్పు రోడ్ గల దానిని కొనుగోలు చేయుటకు శ్రీ బెజవాడ శ్రీనివాసులు, తండ్రి: బి.రాఘవులు, నివాసం: ఇం.నెం. 11-1-87, సంతోష్ నగర్, కందుకూరు, ప్రకాశం జిల్లా-523 105, ఆంధ్రప్రదేశ్ గారితో విక్రయ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. తదుపరి సదరు విక్రయదారుకు అమ్మక ప్రతిఫలంలో భాగంగా భారీమొత్తాన్ని కూడా నా క్లయింట్ చెల్లించారు.

పై సదరు ప్లాట్‌పై ఏదైనా హక్కు, టైటిల్, ప్రయోజనం, క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలు ఏవిధంగానైనా కలిగివున్న ఎవరైనా సాధారణ ప్రజలు / ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (7) రోజులలోగా అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్ల రుజువులతోపాటు దిగువ సంతకందారును సంప్రదించవలెను. ఆ తర్వాత ఎటువంటి క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలు ఏ రకంగాను స్వీకరించబడవు మరియు నా క్లయింట్లు సదరు లావాదేవి పూర్తిచేసుకొనెదరు.

సం/- **కె.రామమూర్తి**, న్యాయవాది
ఇం.నెం. 8-6-641, ప్లాట్ నెం. 5/A1, సాయిరాం కాలనీ, స్ట్రీట్ నెం. 2, బి.ఎన్.రెడ్డి. నగర్, హైదరాబాద్-500 070,
మొబైల్: 9441041932.

■ జోరుగా ఉపాధి పనులు

ఉపాధిహామీ కూలీల హాజరును నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

నవాబుపేట, మే 28 : మండల పరిధిలోని గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు జోరుగా సాగుతున్నాయి. కూలీలు పొద్దున 6:30 గంటల సమయంలోనే కూలీ పనులు ప్రారంభించి ఎండ తీవ్రత కాకముందే పనులు పూర్తి చేసుకొంటున్నారు. కూలీలు ఆరోగ్య పరమైన జాగ్రత్తలను తీసుకోవాలని, అధిక మోతాదులో నీటిని తప్పనిసరిగా తీసుకోవాలని ఫిల్డ్ అసిస్టెంట్లు సూచిస్తున్నారు. కూలీలు పనిచేసే స్థలంలో ఫస్ట్ ఏడ్ బాక్స్‌లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తూ హాజరు శాతాన్ని నమోదు చేసుకుంటున్నారు. పనిచేసే సమయంలోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. పులుమామిడి, ఏక్‌మామడి, మాదిరెడ్డిపల్లి, గంగ్యాడ, చిట్టిగిద్ద యెల్లకొండ వంటి గ్రామాల్లో కూలీలు ఉపాధిహామీ పనులపై మక్కువ చూపిస్తున్నారు. వచ్చే వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీలతోనే నర్సరీల్లో పెరిగే మొక్కలను సంరక్షించేలా చర్యలు చేపడుతున్నారు.

విశ్రాంత ఎస్ఐకి టోకరా

రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీతో సహా నలుగురిపై చీటింగ్ కేసు

బంజారాహిల్స్, మే 28: స్థలం విక్రయం పేరుతో విశ్రాంత ఎస్ఐని నమ్మించి మోసం చేసిన రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీతో సహ నలుగురిపై ఫిలింనగర్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నేరేడ్‌మెట్‌కు చెందిన ఈస్ట్ కాకతీయ నగర్‌లో నివాసముంటున్న ఈడిగ శ్రీశైలం పోలీసు శాఖలో ఎస్ఐగా పనిచేసి ఇటీవల ఇటీవలే పదవీ విరమణ పొందారు. ఏడాది కిందట అతడికి ఫిలింనగర్‌లోని త్రివిష్ట వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో మార్కెంటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న నాగరాజు పరిచయమయ్యాడు. సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల్ గ్రామ శివారులో ఉన్న స్థలం కొనుగోలు చేస్తే మంచి లాభం వస్తుందని నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మిన శ్రీశైలం తన భార్య లక్ష్మి పేరుతో త్రివిష్ట వెంచర్స్ సంస్థ నుంచి రూ.22 లక్షల ధరకు మూడు గుంటల భూమి కొనేందుకు అగ్రిమెంట్ చేసుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.10 లక్షలు చెల్లించారు. మూడు నెలల్లో రిజిస్ట్రేషన్ చేస్తామని సంస్థ చైర్మన్ సీతారాం, మార్కెటింగ్ మేనేజర్ నాగరాజు, బాబ్జీ తదితరులు నమ్మించారు. అయితే, అనుకున్న సమయానికి రిజిస్టర్ చేయకపోగా.. వివిధ కారణాలు చెబుతూ కాలయాపన చేశారు. దీంతో ఫిలింనగర్‌లోని ఆఫీసుకు వెళ్లగా.. ఫేజ్ -1లోని స్థలానికి బదులుగా ఫేజ్-2లో ఉన్న స్థలం రిజిస్టర్ చేయిస్తామని నమ్మబలికారు. దీంతో మరో రూ.10లక్షలు చెల్లించారు. అయితే, రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లినా.. సంస్థ నుంచి ఎవరూ రాకపోవడంతో ఇటీవల మరోసారి ఆఫీసుకు వెళ్లి ప్రశ్నించగా.. తీసుకున్న రూ.20 లక్షలు తిరిగి ఇస్తామని చెప్పి చెక్కులు ఇచ్చారు. చెక్కులు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యాయి. ఉద్దేశపూర్వకంగానే మోసం చేసిన సంస్థ చైర్మన్ సీతారాంతో పాటు ఇతరులపై చర్యలు తీసుకోవాలని శ్రీశైలం మంగళవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 406, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చురుగ్గా పాఠశాల పనులు

పెద్దేముల్, మే 28: మండల పరిధిలోని మారేపల్లితండా ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాఠశాల మరమ్మతుల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని మారేపల్లితండా ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలలో మరమ్మతు పనుల్లో భాగంగా మూత్రశాలలకోసం 70వేల రూపాయ లు, తాగునీటి సౌకర్యం కోసం రూ. లక్ష, విద్యుత్ సౌకర్యం కోసం రూ.25 వేలు మం జూరైనట్లు తెలిపారు. మారేపల్లి తండా ప్రాథమిక పాఠశాల పాఠశాల హెచ్‌ఎం, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి పి.నవీన్‌కుమార్ పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేయిస్తున్నారు.

పూడూరు,మే 28: పూడూరు మండలంలోని మైసమ్మగడ్డ తండాలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులకు సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశం మంగళవారం రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కిషన్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, పాండు, హనుమంత్‌నాయక్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జడ్పీహెచ్‌ఎస్ చందానగర్ పాఠశాలకు చెందిన 1998-99 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు మంగళవారం సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జయప్రకాశ్, కిషన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గౌరీ శంకర్, రాంరెడ్డి, వెంకట్‌రాజ్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

మహిళలు రుతు పరిశుభ్రత పాటించాలి

పీహెచ్‌సీలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

బొంరాస్‌పేట, మే 28 : రుతుస్రావం సమయంలో మహిళలు సరైన పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్ అన్నారు. రుతుస్రావ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 18 నుంచి 40 ఏళ్లలోపు మహిళలకు రుతుస్రావ పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, శానిటరీ ప్యాడ్స్ వాడే విధానంపై, అపరిశుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు వస్తాయో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివరాజ్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, సూపర్‌వైజర్ నిరంజనమ్మ, ఆయూష్ ఫార్మాసిస్ట్ సుదర్శన్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని సబ్ సెంటర్లలో కూడా ఏఎన్‌ఎంలు రుతు పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించారు.

బ్యాంకులో బురిడీ

ఆన్‌లైన్‌లో మీ ఖాతాకు డబ్బు పంపిస్తానని మోసం

వెంగళరావునగర్, మే 28: బ్యాంక్‌లో ఓ ఖాతాదారుడిని బురిడీ కొట్టించాడో మోసగాడు. ఆన్‌లైన్ ద్వారా అకౌంట్‌కు డబ్బు పంపిస్తానని నమ్మించి.. నకిలీ మెసేజ్ చూపెట్టి అక్కడి నుంచి ఉడాయించాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణనగర్‌లో నివాసముండే తోట మోహన్ ప్రైవేటు ఉద్యోగి. సోమవారం మధ్యాహ్నం మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో డబ్బును డిపాజిట్ చేసేందుకు వచ్చాడు. అతడిని మోసగాడు గమనించాడు. మోహన్ వద్దకు వచ్చిన మోసగాడు.. తనకు క్యాష్ అవసరం ఉన్నది.. మీ వద్దనున్న రూ.24వేలు ఇస్తే ఆన్‌లైన్ ద్వారా మీ ఖాతాకు డబ్బు పంపిస్తానని చెప్పి, నగదు తీసుకున్నాడు. కొద్ది క్షణాల్లోనే బాధితుడు మోహన్ ఖాతాకు డబ్బు పంపినట్లు మోసగాడు ఓ మెసేజ్ చూపించి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత మోహన్ తన ఖాతాను పరిశీలించుకోగా.. డబ్బు జమకాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి.. ఏడుగురు అరెస్ట్

బంజారాహిల్స్, మే 28: ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. షేక్‌పేట వినాయక్‌నగర్‌లో ఉంటున్న అంకూరి నాగరాజు(40) మేస్త్రి. కొంతకాలంగా తన ఇంట్లో ఇతర వ్యక్తులను పిలిపించి పేకాటశిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు దాడులు నిర్వహించారు.

నేడు రక్తదాన శిబిరం

వికారాబాద్, మే 28 : రంగారెడ్డి ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వికారాబాద్ డీపీఈవో ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘు వీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. బుధవారం ఉదయం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న డీపీ ఈవో కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో యువత,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-AII
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రేపటిలోగా మరమ్మతులు పూర్తి చేయాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారిణి జ్యోతీ పద్మ

పెద్దేముల్, మే 28: ఈ నెల 30వ తేదీలోపు అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారిణి జ్యోతీ పద్మ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలతో గ్రామాల వారీగా పనుల పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతీపద్మ మాట్లాడుతూ మండలం లోని మొత్తం 58 పాఠశాలల్లో 37 పాఠశాలల్లో రూ. కోటీ 8 లక్షల 80 వేల విలువగల పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఆయా పాఠ శాలల్లో 100 శాతం విద్యుత్ సౌకర్య పనులు, 80 శాతం తాగునీరు, మూత్రశాలల పనులు పూర్తి కావచ్చాయన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వ ర్యంలో కొనసాగుతున్న మరమ్మతు పనులను ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ఐకేపీ సీసీలు పూర్తిఅయ్యేలా చూడా లన్నారు. మరమ్మతు పనులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా యన్నారు. గ్రామస్థాయి అధికారులు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఐకేపీ సీసీలు పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా చూసుకోవాలని ఆదేశించారు. సమా వేశంలో ఎంపీడీవో జర్న ప్ప, పీఆర్ ఏఈ సిద్ధార్థ, ఏపీఎం బాలయ్య, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మూడు పాఠశాలల్లో ప్రారంభం కాని పనులు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యాల మరమ్మతు పనులు పక్కాగా కొనసాగాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలను జారీ చేసినప్పటికీ ఇందూరు, తింసాన్‌పల్లి, తట్టేపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఇప్పటివరకు అసలు పనులే ప్రారంభం కాలేదు. మంగళవారం స్పెషల్ ఆఫీసర్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ విషయం బయట పడింది. ఇప్పటికైనా పనులు ప్రారంభించి రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్పెషల్ ఆఫీసర్ జ్యోతీపద్మ సంబంధిత అధికారులను ఆదేశించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962